నాడు చకచకా.. నేడు చతికిలా..

జోన్–2లో అభివృద్ధి పనులకు బ్రేక్ | మధ్యలోనే నిలిచిపోయిన నిర్మాణాలు | మండి పడుతున్న ప్రజలు


ఆర్చి నిర్మాణంతో ఆగిపోయిన జీవీఎంసీ నర్సరీ పనులు

తూర్పు నియోజకవర్గంలో పలు చోట్ల అభివృద్ధి పనులు పడకేశాయి. ఈ ఏడాది మేలో జరిగిన సాధారణ ఎన్నికల ముందు చకచకా జరిగిన అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం బ్రేక్ పడింది. నియోజకవర్గంలోని జీవీఎంసీ జోన్–2 పరిధిలో గల పలు ప్రాంతాల్లో మధ్యలో నిలిచిన పనులు ఎక్కువగా ఉన్నాయి. ఇవి పూర్తయితే వినియోగంలోకి వస్తాయని ఎదురు చూస్తున్న స్థానికులకు కూటమి ప్రభుత్వంలో నిరాశ ఎదురవుతోంది. పెదగదిలి జంక్షన్ నుంచి తోటగరువు కూడలి వరకు, అక్కడి నుంచి బాలాజీనగర్ **దుర్గాలమ్మ గుడి మీదుగా అంబేడ్కర్ కూడలి వరకు చేపట్టదలిచిన డబుల్ రోడ్డు, ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్ వద్ద కల్యాణ మండపం విస్తరణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. దీంతోపాటు కైలాసగిరిపై చేపట్టిన సైన్స్ మ్యూజియం పనులు సగంలో ఆగిపోయాయి. కూటమి పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతోపాటు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పను**లను సైతం జరగకుండా ఆపేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రూ.కోట్ల ప్రజాధనం వృథా చేశారంటూ మండిపడుతున్నారు. – ఆరిలోవ

పునాదులకే పరిమితమైన సైన్స్ మ్యూజియం


కైలాసగిరిపై పునాదుల దశలో నిలిచిన సైన్స్ మ్యూజియం నిర్మాణ పనులు

ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరిపై వీఎంఆర్‌డీఏ చేపట్టిన సైన్స్ మ్యూజియం నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నిలిపేశారు. రాష్ట్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం కలసి మ్యూజియం గ్రాంట్ స్కీం కింద సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఎస్‌సీఏపీ) ఆధ్వర్యంలో ఇక్కడ ఆధునిక సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం ఏర్పాటు చేయదలచాయి. ఇందులో భాగంగా 2024 జనవరి 2న అప్పటి ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వీఎంఆర్‌డీఏ అధికారులతో కలసి శంకుస్థాపన చేశారు. సుమారు ఎకరం విస్తీర్ణం గల స్థలంలో మ్యూజియం నిర్మాణం కోసం రూ.4.69 కోట్లు **నిధులు కేటాయించారు. పనులు చకచకా చేపట్టారు. సుమారు నాలుగు నెలల్లో స్థలం చదును చేయించి పునాదులు, ప్లాట్‌ఫారం నిర్మించారు. అనంతరం ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో మ్యూజియం పనులను అధికారులు నిలిపేశారు. ఈ నిర్మాణం పూర్తయితే పర్యాటకులకు విజ్ఞానంతోపాటు వినోదాన్ని ఇచ్చే 3డీ ఆర్ట్ గ్యాలరీ, సిలికా విగ్రహాలు, సైన్స్ వర్కింగ్ మోడల్ ప్రదర్శనలు, శాస్త్రీయ థీమ్‌లు అందుబాటులో ఉంటాయని అప్పట్లో అధికారులు ప్రకటించారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ మ్యూజియం అందని ద్రాక్షగా మిగిలిపోయిందని విమర్శలు వినిపిస్తున్నాయి.**

నర్సరీ నిర్మాణం గాలికి..

జీవీఎంసీ నర్సరీ నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. సుమారు ఏడాది దాటినా గోడల నిర్మాణం తప్పా మరే పనులు జరగకుండా నిలిపేశారు. **బీఆర్‌టీఎస్ రోడ్డును** ఆనుకొని **దీన్‌దయాళ్‌పురం వద్ద జీవీఎంసీ** నర్సరీ ఉండేది. **దీనిలో వివిధ రకాల మొక్కలను** ఉత్పత్తి చేసే**వారు. రోడ్ల డివైడర్లు, రోడ్ల** పక్కన నాటడానికి **మొక్కలను ఇక్కడి నుంచే** పంపిణీ చేస్తుండే**వారు. ఈ నర్సరీ స్థలంలో** ప్రస్తుతం జీవీఎంసీ **పిల్లల పార్కు నిర్మిస్తోంది. దీంతో** నర్సరీ మూత **పడింది. అధికారులు** ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక దీని నిర్మాణం చేపడుతున్నారు. ఇక్కడ జీవీఎంసీకి చెందిన ఎకరా పైగా స్థలంలో చుట్టూ గోడలు, ముఖద్వారం నిర్మాణం చేపట్టి వదిలేశారు. దీంతో జీవీఎంసీకి మొక్కలు ఉత్పత్తి చేసే కేంద్రం లేకుండా పోయింది.


తోటగరువు వద్ద మధ్యలో నిలిచిపోయిన డబుల్ రోడ్డు పనులు


ముడసర్లోవ పార్కులో నిలిచిపోయిన గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రం పనులు

నిలిచిన డబుల్ రోడ్డు నిర్మాణం

10, 11, 12 వార్డుల పరిధిలోని పెదగదిలి జంక్షన్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులను 2023 డిసెంబర్‌లో జీవీఎంసీ ప్రారంభించింది. దీని కోసం సుమారు రూ.7 కోట్లు కేటాయించింది. కిలోమీటరు పైగా ఉన్న ఈ రోడ్డు ఇరుపక్కలా అవసరమైన చోట్ల విస్తరించి మధ్యలో డివైడర్లు నిర్మించడం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతోపాటు పాత్‌వేలు నిర్మించి అందంగా తయారు చేయడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగా మార్చి వరకు పనులు జరిగాయి. ఎన్నికల కోడ్ పేరుతో మధ్యలో జరుగుతున్న పనులను నిలిపేశారు. పెదగదిలి సమీపం ఎర్నిదుర్గమాంబ గుడి నుంచి తోటగరువు వరకు డివైడర్ కోసం గోడలు నిర్మించి వదిలేశారు. బాలాజీనగర్‌లో రోడ్డు మధ్యన డివైడర్ నిర్మాణం కోసం తవ్వి వదిలేశారు. ఆపై పనులను జరపకుండా అధికారులు బ్రేక్ వేశారు.

గుర్రపు స్వారీ కలే..!

ముడసర్లోవ పార్కులో జీవీఎంసీ చేపట్టిన గుర్రాల స్వారీ శిక్షణ కేంద్రం ఆగిపోయింది. విశాఖలో ఇలాంటి కేంద్రం అవసరం లేదంటూ జీవీఎంసీ కౌన్సిల్‌లో సభ్యులు వ్యతిరేకించి దీని నిర్మాణాన్ని నిలిపేశారు. అప్పటికే దీని నిర్మాణం కోసం రూ.9 కోట్లు ప్రజాధనం కేటాయించారు. దానిలో కొన్ని కోట్లు ఖర్చు చేసేశారు. సుమారు మూడెకరాల రోజ్ పార్కును నాశనం చేసేశారు. అందులో పచ్చని మామిడి చెట్లు, కొబ్బరి, తాటి, జీడిచెట్లు తొలగించేశారు. ఇక్కడ గుర్రాల కోసం ప్రత్యేకంగా షెల్టర్, విశ్రాంతి గదులు నిర్మించారు. స్వారీ చేయడానికి వీలుగా ప్రత్యేకంగా రెండు పెద్ద రింగులు, సందర్శకుల కోసం గేలరీల నిర్మాణం చేపట్టారు. ఆయా నిర్మాణాలన్నీ సగంలో నిలిచిపోయాయి. దీంతో అంతవరకు పిక్నిక్‌లు, సభలు, సమావేశాలకు ఎంతో అనుకూలంగా ఉండే ఈ పార్కు అస్తవ్యస్తంగా మారింది.

క్లుప్తంగా

క్రీడలతో మానసిక ఉల్లాసం


పోటీలు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రాజు

విశాఖ విద్య: క్రీడలతో శారీకరంగానే కాకుండా మానసిక ఉల్లాసం కలుగుతుందని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు అన్నారు. సైన్స్ డేను పురస్కరించుకుని ఏయూ సిల్వర్ జూబ్లీ మైదానంలో నిర్వహిస్తున్న వివిధ విభాగాల విద్యార్థులకు వాలీబాల్, పురుషులు, మహిళల పోటీలను శనివారం ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రతి ఏడాది విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా 20వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. అనంతరం మహిళలు, పురుషులు వాలీబాల్ సర్వీస్ చేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎస్.విజయ్‌మోహన్, స్టాటస్టిక్స్ విభాగం ప్రొఫెసర్ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

‘మాస్టరింగ్’ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, డాక్టర్ జి.శ్రీనివాసరావు సంయుక్తంగా రాసిన ‘మాస్టరింగ్’ ఫైనాన్సియల్ సర్వీసెస్ మార్కెటింగ్ అనే పుస్తకాన్ని శనివారం వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఐ.ఎ.ఎస్.ఇ. ప్రిన్సిపాల్ ఆచార్య నగరాజాకుమారి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే వెలగపూడి తదితరులు

ఎంవీపీకాలనీ: విశాఖపట్నం వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఎంవీపీ శాఖ ఆధ్వర్యంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని సమతా డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. రక్తదానం చేసేందుకు యువతతో పాటు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని సూచించారు. వాసవీ క్లబ్ సేవా కార్యక్రమాలను అభినందించారు. క్లబ్ ఎంవీపీ శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, సాయినిర్మల, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. నగరంలో 15 చోట్ల రక్తదాన శిబిరాలు జరిగినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు.

సంగీతంలో ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్‌లు

బీచ్‌రోడ్డు: సంగీతం, ప్రదర్శన కళల్లో నిరుపేద ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు స్కాలర్‌షిప్‌లు ప్రవేశపెట్టినట్లు బుక్ మై షో ఫౌండేషన్ బుక్ ఏ ఛేంజ్ హెడ్ ఫర్జానా కామా బాల్పాండే తెలిపారు. స్కాలర్‌షిప్ వివరాలను శనివారం వివరించారు. బుక్ ఏ ఛేంజ్ ప్రధాన ఆశయం సంగీతం, ప్రదర్శన కళల్లో భవిష్యత్ మార్గదర్శకులను ప్రేరేపించడం, వృద్ధిలోకి వచ్చేలా చేయడమన్నారు. దేశ వ్యాప్తంగా పేదరికం నేపథ్యాల నుంచి ప్రతిభావంతులైన వ్యక్తులకు సాధికారత కల్పించే లక్ష్యంతో 500 సంగీత స్కాలర్‌షిప్‌లను అందజేస్తామని చెప్పారు. గుర్తింపు పొందిన సంస్థల్లో సంగీతానికి సంబంధించి విద్యను అభ్యసించే విద్యార్థులు, వీధి కళాకారులకు ఈ స్కాలర్‌షిప్ ప్రదానం చేస్తామన్నారు.

కేజీహెచ్ ఆక్సిజన్ ప్లాంట్ వద్ద పటిష్ట భద్రత

మహారాణిపేట: కేజీహెచ్ ఆక్సిజన్ ప్లాంట్ వద్ద ఎటువంటి ఇబ్బంది లేకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ తెలిపారు. ఇటీవల ఆక్సిజన్ ప్లాంట్ వద్ద ఉన్న పైపులను కొంత మంది వ్యక్తులు కోసిన సంగతి తెలిసిందే. ఆ ప్రాంతంలో ప్రత్యేకంగా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేసి చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. శనివారం డీసీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ మెహర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవీలత సీఎస్ఆర్ బ్లాక్ వద్ద ఉన్న ఆక్సిజన్ ప్లాంట్ పరిసరాలను తనిఖీ చేశారు. అక్కడ పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు చేపట్టారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

మహారాణిపేట: రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మూడో శనివారం సందర్భంగా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పి.రాధారాణి కార్యాలయ ఆవరణను చీపురుతో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం పరిసరాల పరిశుభ్రతకు కొంత సమయం కేటాయించాలన్నారు. కార్యాలయం లోపల, వెలుపల మొక్కలు ఏర్పాటు చేసి సంరక్షించాలని సూచించారు. తడి, పొడి, ప్రమాదకర చెత్త సేకరణకు గ్రీన్, రెడ్ బ్లూ డస్ట్ బిన్లు ఉపయోగించాలన్నారు. ఇళ్లు, దుకాణాలు, పాఠశాలలు, సంస్థలు తదితర ప్రదేశాల్లో ఏర్పడే చెత్తను 3 రకాలుగా వేరు చేసేలా అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొని తమ తమ సెక్షన్లను, పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు.


కార్యాలయ ఆవరణను చీపురుతో శుభ్రం చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, డాక్టర్ రాధారాణి

ఆవుల అక్రమ తరలింపుపై కేసు

ఆరిలోవ: ఆవుల అక్రమ తరలింపుపై ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ సీహెచ్ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా.. విజయనగరం జిల్లా రాజాం సంతలో కొనుగోలు చేసిన ఆవులను శనివారం మహ్మద్ రఫీ వ్యానులో కిక్కిరిసి ఆరిలోవ ప్రాంతం ముస్తఫా కాలనీకి తీసుకొచ్చాడు. వాటిని బాలాజీనగర్ దుర్గాలమ్మ గుడి వద్ద కొందరు స్థానికులు పట్టుకొని ఆవులను హింసిస్తూ వ్యానులో అక్రమంగా తీసుకువస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మల్లేశ్వరరావు, ఎస్ఐలు రాందాస్, కృష్ణ, సిబ్బందితో చేరుకొని వ్యానుతోపాటు అందులో ఉన్న నాలుగు ఆవులు, ఒక దూడను స్టేషన్‌కు తరలించారు. ఆవులు కొనుగోలు చేసి అక్రమంగా తీసుకువస్తున్నట్లు మహ్మద రఫీ, వ్యాన్ డ్రైవర్ గణేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆవులను తగరపువలసలో యానిమల్ వెల్ఫేర్ సొసైటీకి తరలించినట్లు తెలిపారు. ముస్తఫా కాలనీలోని గోమాంస దుకాణాలు పలువురు వ్యాపారులు నిర్వహిస్తున్నారు. పశు మాంసం విక్రయం కోసం వ్యాపారులు తరుచూ ఆవులను వ్యానులో తీసుకువస్తున్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆవులు

ఏయూలో ముగిసిన వర్క్‌షాప్

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్, ముదునూరు డ్రీమ్స్ అకాడమీ, డాక్టర్ పల్లం సెట్టి సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ సహకారంతో ‘ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్’పై రెండు రోజుల పాటు నిర్వహించిన సదస్సు శనివారంతో ముగిసింది. వర్క్‌షాప్‌లో ఆర్ఎన్ఎస్, జీఏఎన్ఎస్, సీఎన్ఎన్, ఎంఎల్ వంటి విద్యార్థులు పరిశోధన పత్రాలు సమర్పించారు. ఇలాంటి సదస్సులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, వీటిని నిర్వహించేందుకు తగిన శ్రద్ధ తీసుకున్నామని ఇంజినీరింగ్ ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్.పద్మశ్రీ అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్.పల్లం సెట్టి, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ కె.సౌమ్య, ముదునూరు డ్రీమ్స్ అకాడమీ వ్యవస్థాపకుడు–చైర్మన్ డా.ఎం.ఎస్.రాజు ముదునూరు, 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న విద్యార్థులు

స్వచ్ఛత.. మన బాధ్యత


విమ్స్ ఆవరణలో మొక్కలు నాటుతున్న డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, సిబ్బంది

ఆరిలోవ: నియోజకవర్గంలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆస్పత్రుల్లో అధికారులు ఆవరణలను పరిశుభ్రం చేశారు. 10వ వార్డులోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పరిసరాల్లోని చెత్తను ఊడ్చి శుభ్రం చేశారు. పలు పక్కలు నాటారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యతని విమ్స్ డైరెక్టర్ రాంబాబు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

- 13వ వార్డు శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకులంలో ప్రిన్సిపాల్ రత్నవల్లి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులతో కలసి ఆవరణ శుభ్రం చేశారు. పరిసరాల్లో వివిధ రకాల మొక్కలు నాటారు.
- ఎంవీపీ రైతుబజార్‌లో ఎస్టేట్ ఆఫీసర్ వరహాలు ఆధ్వర్యంలో రైతులు, వ్యాపారులు, డ్వాక్రా మహిళలు చీపుర్లు పట్టుకొని బజార్ ఆవరణలో చెత్త ఊడ్చారు. స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. సిబ్బంది కనకరాజు తదితరులు పాల్గొన్నారు.
- విశాఖ కేంద్ర కారాగారంలో అధికారులు స్వర్ణాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. కారాగారం లోపల ఖైదీలతో కలసి ఆవరణ, పరిసరాలను పరిశుభ్రం చేశారు. కారాగారం బయట బీఆర్‌టీఎస్ రోడ్డును ఆనుకొని ప్రధాన ద్వారం నుంచి ప్రవేశ ద్వారం వరకు పరిసరాలను డిప్యూటీ సూపరింటెండెంట్లు సాయిప్రవీణ్, సూర్యకుమార్, సిబ్బందితో కలసి చీపుర్లు పట్టుకొని శుభ్రం చేశారు. సిబ్బందితో కలిసి స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.


శ్రీకృష్ణాపురం గురుకులంలో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ రత్నవల్లి, విద్యార్థులు


ఎంవీపీ రైతుబజార్‌లో స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేస్తున్న రైతులు, వ్యాపారులు


కేంద్ర కారాగారం ప్రధాన ద్వారం ముందు చీపుర్లతో ఊడ్చుతున్న అధికారులు, సిబ్బంది

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 17వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో జోన్–3 కమిషనర్ శివప్రసాద్ పాల్గొని చెత్త సేకరణలో అనుసరించాల్సిన విధానాలను వివరించారు. పారిశుధ్య నిర్వహణపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్థానిక సంఘాలతో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించడంతోపాటు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పెద్ద ఎత్తున కృషి చేయాలని కోరారు. పలువురు జోన్–3 అధికారులు పాల్గొన్నారు.

కృష్ణా జూనియర్ కళాశాలలో..

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులు కాలేజీ పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం స్వర్ణాంధ్ర– స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో..

ఎంవీపీకాలనీ: హౌసింగ్ కార్పొరేషన్ విశాఖ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని కార్యాలయం, ఆవరణలో పరిసరాలను అధికారులు, ఉద్యోగులు శుభ్రపరిచారు. కార్పొరేషన్ హెడ్ సీహెచ్ సత్తిబాబు మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఉద్యోగులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈఈ శ్రీనివాసరావు, మేనేజర్ మేరీగ్రేస్ తదితరులు పాల్గొన్నారు.


కృష్ణా జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది

వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో..

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగ భవన్ ఆవరణలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛ విశాఖ కార్యక్రమం నిర్వహించారు. విశాఖ పరిసరాలను మరింత పరిశుభ్రంగా, పచ్చగా మార్చేందుకు కృషి చేస్తామని వీఎంఆర్‌డీఏ కార్యదర్శి మురళీకృష్ణ ఉద్యోగులందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కార్యాలయ ఆవరణలోని చెత్తను ఉద్యోగులు తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, సీయూపీ శిల్ప, ప్రధాన గణాంకాధికారి హరిప్రసాద్, కార్యనిర్వాహక ఇంజినీర్ సింగ్, ప్రణాళికాధికారులు, పరిపాలనాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వీఎంఆర్‌డీఏ కార్యదర్శి మురళీకృష్ణ

రహదారి పనులకు ఆటంకం

ఆరిలోవ: ఆరిలోవ న్యూ పోలీస్ స్టేషన్ రహదారి పనులు మందగించాయి. బీఆర్‌టీఎస్ రోడ్డును ఆనుకొని విమ్స్ ప్రాంగణంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి పక్కన నిర్మించిన ఈ పోలీస్ స్టేషన్ రెండు నెలల కిందట ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ స్టేషన్‌కు వెళ్లడానికి ప్రత్యేకంగా రహదారి లేదు. దీంతో పోలీస్ వాహనాలు, అవసరాల కోసం వెళ్లే ప్రజలు విమ్స్ ప్రాంగణంలో రహదారినే వినియోగించాల్సి వస్తోంది. దీంతో ఈ స్టేషన్‌కు ప్రత్యేకంగా రహదారి నిర్మాణం చేపట్టదలిచారు. ఇందులో భాగంగా గత నెల 22న రహదారి పనులను సుమారు రూ.60 లక్షలకు పైగా నిధులతో ప్రారంభించారు. ఇక్కడ బీఆర్‌టీఎస్ రహదారికి, స్టేషన్‌కు మధ్యలో పెద్ద గెడ్డపై వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ పనులు జరుపుతుండగా గెడ్డ అడుగు భాగంలో రెండు యూజీడీ ప్రధాన పైప్‌లైన్లు బయటపడ్డాయి. ఆరిలోవ నుంచి హనుమంతవాక సీవేజ్ ప్లాంట్ వరకు ఈ పైప్‌లైన్లు గతంలో అమర్చారు. ఇవి ఇక్కడ జరుగుతున్న పనులకు ఆటంకంగా మారాయి. కల్వర్టు నిర్మాణంలో భాగంగా ఇక్కడ అడుగు భాగంలో ప్లాట్‌ఫారం, స్తంభాల నిర్మాణానికి ఇవి అడ్డంగా ఉన్నాయి. ఆ పైప్‌లైన్‌ను పక్కకు మార్చడానికి వీలుపడదు. వాటి మధ్య నుంచి పనులు చేపట్టడానికి ఇబ్బందిగా మారింది. అడుగు భాగంలో ప్లాట్‌ఫారం నిర్మాణం కోసం మట్టి బయటకు తీయడానికి పొక్లెయిన్‌కు వీలుపడటం లేదు. కూలీలతో మట్టి తీయించడానికి వారాలు పడుతోంది.

గెడ్డ మధ్యలో ఇక్కడ పైప్‌లైన్లు ఉన్నట్లు జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు ముందుగా అవగాహన లేకపోవడంతో ఈ సమస్య తలెత్తినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. దీనివల్ల రహదారి నిర్మాణ పనులు ఆలస్యమవుతున్నాయని స్థానికులు అంటున్నారు. అధికారులు అవగాహన లేకుండా ఇక్కడ కల్వర్టు పనులు జరిపించేశారు. ఆ పైప్‌లైన్‌లను ముందే గుర్తించి గలిగితే దానికి పక్కన కల్వర్టు నిర్మాణం చేపట్టేవాళ్లమంటూ అధికారులు ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు.


ఆరిలోవ న్యూ పోలీస్ స్టేషన్ రహదారి పనుల మధ్యలో యూజీడీ పైప్‌లైన్